

భారీగా నల్లబెల్లం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న టన్ను నల్లబెల్లం, 600 కేజీల పటికను కోదాడ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు.

- 8లో



యాదాద్రిలో భక్తులకు అస్వస్థత

యాదాద్రి ఆలయ క్యూకాంప్లెక్స్‌లో ఫ్యాన్లు పనిచేయక శనివారం భక్తులు ఉక్కపోతతో అస్వస్థతకు గురయ్యారు.

- 8లో

గరిష్టం / కనిష్టం

41° / 31°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

27న సెలవు

భానుపురి (సూర్యాపేట): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోనఫైడ్ ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజున ఓటుహక్కు వినియోగానికి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు మేరకు ప్రత్యేక సాధారణ (క్యాజువల్) సెలవు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలకు సెలవు ఇచ్చే అవకాశం లేకపోవడంతో డ్యూటీ షిఫ్టుల వారీగా మార్పులు చేయాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



గణపవరంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

మునగాల(కోదాడ): గ్రామాల అభివృద్ధితోపాటు విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మునగాల మండలం గణపవరం గ్రామంలో పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవిరెడ్డి వీరారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ విజయలక్ష్మి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

చిలుకూరు: ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్, జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి కోరారు. శనివారం చిలుకూరులో నిర్వహించిన ఎస్‌టీయూ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు వారు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల్లాగా విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్, పున్న గణేష్, శ్రీనివాస్, నాయకులు బందం వెంకటేశ్వర్లు, ఎలగొండ శ్రీనివాస్, సురగాని లింగయ్య, కొండా రామాంజనేయులు, బీఆర్‌సీ.రెడ్డి, వీరేంద్ర వర్మ, భిక్షం, చంద్రశేఖర్, అంజయ్య, నాగరాజు, శివయ్య, గోవిందునాయక్, రామిరెడ్డి, రాజేష్, నర్సింహారావు, బూర వెంకటేశ్వర్లు, కస్తూరి అప్పారావు, గోపి, సురేష్, సాదె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గొల్లకుర్మలకు నగదు బదిలీ చేయాలి



అర్వపల్లి పశువైద్యశాల ఎదుట ధర్నా చేస్తున్న జీఎంపీఎస్ నాయకులు

అర్వపల్లి: గొల్ల కుర్మలకు నగదు బదిలీ పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీఎంపీఎస్ ఆధ్వర్యంలో శనివారం అర్వపల్లిలోని పశువైద్యశాల ఎదుట ధర్నా నిర్వహించారు. రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీసి ఏడాది దాటినా ఇంతవరకు నగదు బదిలీ చేయలేదని చెప్పారు. గొల్లకుర్మలు అప్పులు తెచ్చి డీడీలు తీసి ప్రభుత్వానికి చెల్లించారని, వారి సమస్యలను అర్థం చేసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో ఆ సంఘం నాయకులు గుడిపాటి సత్తయ్య, వజ్జె జయమ్మ, భయ్య భద్రమ్మ, వజ్జె మల్లమ్మ, వజ్జె వెంకన్న, వినోద్, అవిలమ్మ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం?

కాంగ్రెస్‌లో చేరిన 8 మంది డైరెక్టర్లు

- అనుకూల డైరెక్టర్లతో ఇటీవల భేటీ అయిన ఆశావహ డైరెక్టర్
- అవిశ్వాసానికి 14 మంది మద్దతు అవసరం
- మద్దతు కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు
- జూన్ మొదటి వారంలో అవిశ్వాసం పెట్టే ఆలోచన
- టెస్కాబ్‌లోనూ అవిశ్వాసం పెట్టిన సభ్యులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. త్వరలోనే అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు డైరెక్టర్లు సన్నద్ధమవుతున్నారు. డైరెక్టర్లలో పలువురు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరడంతో డీసీసీబీలో ఆ పార్టీ బలం పెరిగింది. పైగా ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఎమ్మెల్యేలను గెలుచుకోవడంతోపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తమ పార్టీకి చెందిన వారికి ముఖ్యమైన పదవులను కట్టబెట్టే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగానే డీసీసీబీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధీనంలోకి తీసుకొని మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి అప్పగించే ఆలోచనలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నట్లు తెలిసింది. ఇందుకు అవిశ్వాసానికి అవసరమైన డైరెక్టర్ల మద్దతు కూడగట్టి జూన్ మొదటి వారంలో నోటీసు ఇచ్చేందుకు రంగం చేసినట్లు తెలుస్తోంది.

తొమ్మిదికి చేరిన కాంగ్రెస్ బలం

డీసీసీబీలో మొత్తం 21 మంది డైరెక్టర్లు ఉండాలి. అందులో ప్రస్తుతం 19 మంది ఉన్నారు. మరో ఇద్దరిని నామినేట్ చేయాల్సి ఉన్నా ఆయా రిజర్వేషన్ల సభ్యులు లేకపోవడంతో చేయలేదు. ప్రస్తుతం ఉన్న 19 మంది డైరెక్టర్లలో 18 మంది టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్. ఇటీవల డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లలో తుంగతుర్తికి చెందిన గుడిపాటి సైదులు, భువనగిరికి చెందిన అందెం లింగంయాదవ్, నాగార్జునసాగర్‌కు చెందిన ఇరిగినేని అంజయ్య (గతంలో బీఆర్‌ఎస్‌లో ఉండగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.), మిర్యాలగూడకు చెందిన బంటు శ్రీనివాస్, కోదాడకు చెందిన వీరస్వామి, కొండా సైదయ్య, నల్లగొండకు చెందిన పాశం సంపత్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ బలం తొమ్మిదికి చేరింది.

చైర్మన్ రేసులో కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ రేసులో కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన ఆయన ప్రస్తుతం డీసీసీబీ డైరెక్టర్‌గా ఉన్నారు. మొదటి నుంచి రాజగోపాల్‌రెడ్డికి వెన్నంటి ఉన్న ఆయనను డీసీసీబీ చైర్మన్‌ను చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది.

16వ రోజున అవిశ్వాసం

కోఆపరేటివ్ యాక్ట్ ప్రకారం నోటీసు ఇచ్చాక 15 రోజుల సమయం ఇస్తారు. 16వ రోజున అవిశ్వాసం తీర్మానం పెడతారు. అందులో నెగ్గితే డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి గొంగిడి మహేందర్‌రెడ్డిని తొలగిస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆమోదంతో నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ అవిశ్వాసం వీగిపోతే గొంగిడి మహేందర్‌రెడ్డి చైర్మన్‌గా కొనసాగుతారు.

2/3 మెజారిటీ అవసరం

నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే బ్యాంకు డైరెక్టర్లలో మూడింట రెండో వంతు (2/3) డైరెక్టర్ల ఆమోదం అవసరం. దాని ప్రకారం ప్రస్తుతం బ్యాంకులో ఉన్న 19 మంది డైరెక్టర్లలో అవిశ్వాసం నెగ్గేందుకు 14 మంది డైరెక్టర్ల మద్దతు కావాలి. అయితే డీసీసీబీ పీఠం ఆశిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి నల్లగొండలో సమావేశం నిర్వహించినప్పుడు 13 మంది హాజరైనట్లు తెలిసింది.

మంత్రి వచ్చాక అవిశ్వాసం నోటీసు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. వారిద్దరు వచ్చాక జూన్ మొదటి వారంలో అవిశ్వాసం నోటీసు ఇచ్చే అవకాశం ఉంది. ఇక వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లాలని భావించినా అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధం అవుతున్న క్రమంలో ఆయన తన పర్యటనను వాయిదా వేసుకున్నారు.

టెస్కాబ్‌లో 10న అవిశ్వాసం

రాష్ట్రస్థాయిలోని టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్‌పైనా అవిశ్వాసం కోరుతూ డైరెక్టర్లు ఇటీవల నోటీసు అందజేశారు. టెస్కాబ్ చైర్మన్‌గా ఉన్న రవీందర్‌రావు కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ కాగా, వైస్ చైర్మన్‌గా ఉన్న గొంగిడి మహేందర్‌రెడ్డి నల్లగొండ డీసీసీబీ చైర్మన్. ఈనెల 10వ తేదీన టెస్కాబ్‌లో నిర్వహించే అవిశ్వాస తీర్మానం నెగ్గితే వీరు ఆయా పదవులు కోల్పోనున్నారు.



కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటరావు

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సామగ్రి సిద్ధం

- ఎన్నికల నిర్వహణకు 340 మంది సిబ్బంది
- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు

భానుపురి (సూర్యాపేట): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌కు మెటీరియల్ సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పోలింగ్ మెటీరియల్ ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకుగాను 340 మంది సిబ్బందిని నియమించామని, వారంతా ఈనెల 26న పోలీస్ బందోబస్తుతో వాహనాల్లో పోలింగ్‌కేంద్రాలకు చేరుకుంటారన్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నాలుగు నియోజకవర్గాల్లో 16 రూట్లలో ఉన్న 71 కేంద్రాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించామన్నారు. ముఖ్యంగా 19 సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట నిఘా ఉంచామని, అన్నిచోట్ల వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఎస్‌ఓ మోహన్‌బాబు, ఆర్‌డీఓ వేణు మాధవ్, తహసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాలలో ఫస్ట్ - ప్రమాణాలలో బెస్ట్

త్రివేణి టాలెంట్ స్కూల్స్

కొత్తగూడెం • ఖమ్మం • హైదరాబాద్

ఫోన్స్: 88855 66627 / 28

IIT (JEE), NEET లలో అత్యుత్తమ శిక్షణ

కృష్ణవేణి కాలేజి

IIT & Medical Academy

ఫోన్: 86861 47048, 94413 21699

వైభవంగా వసంతసేవ, పూర్ణాహుతి

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామికి యాజ్ఞీకులు బొర్రా వెంకటవాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులచే వైభవంగా వసంత సేవ నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో స్వామిఅమ్మవార్లకు చక్రతీర్థం స్నానాలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు దోపోత్సవ పూజలు పూర్తిచేసిన హోమశాలలో రెండురోజులుగా చేపట్టిన మహాలక్ష్మీ హోమాన్ని పూర్ణాహుతి గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, చెన్నూరు విజయ్‌కుమార్ దంపతులు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, బ్రహ్మాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి గావిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

రేపు 'పట్టభద్రుల' పోలింగ్

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుంది. పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రచారం బంద్ అయ్యింది. దీంతో అభ్యర్థుల తరఫున నేతలు ఓటర్లను ఆకర్షించేందుకు తాయిలాలపై దృష్టి సారించారు.

పెద్ద ఎత్తున వాయిస్ కాలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన నాటి నుంచి అభ్యర్థులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ కూడా పెద్ద భారీగా ప్రచారం చేపట్టాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా పట్టభద్రులతో సభలు, సమావేశాలు నిర్వహించాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల్లో పని ప్రదేశాల్లో ప్రచారం చేశాయి. అన్ని పార్టీలు ఈసారి ఫోన్‌ద్వారా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలంటూ వాయిస్ కాలింగ్ ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించాయి.

ఇక, మిగిలింది తాయిలాలే..

పట్టభద్రులను ఆకర్షించేందుకు తాయిలాలను ఎరగా వేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఒక పార్టీ అభ్యర్థి ఓటుకు రూ.వేయి చొప్పున పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుండగా, మరో పార్టీ అభ్యర్థి ఓటుకు రూ.500 పంచేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వని ప్రాంతాల్లో గిఫ్టులు ఇచ్చి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎక్కువ మంది ఓటర్లను తమ వైపు మళ్లించుకునేందుకు అభ్యర్థులు, పార్టీలు ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాయి.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్లు 4,63,839	ఉమ్మడి నల్లగొండలో మొత్తం ఓటర్లు 4,63,839
పురుషులు 2,88,189	నల్గొండ జిల్లాలో 80,871
మహిళలు 1,75,645	సూర్యాపేటలో 51,497
ట్రాన్స్‌జెండర్స్ 5	యాదాద్రిభువనగిరిలో 34,0807



పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అందుకు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బంది, అధికారులకు శిక్షణ పూర్తి చేశారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు. పోలింగ్ కేంద్రాల్లోనూ ఏర్పాట్లు పూర్తి చేశారు. పోటీలో అభ్యర్థులు అధికంగా ఉన్నందున బ్యాలెట్ పేపర్ సైజ్ పెరగడంతో జంబో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. వాటిని కూడా ఆదివారం 12 జిల్లాలోని 605 పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధిక కాన్పులు జరగాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ కోటాచలం

సూర్యాపేట టౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధిక కాన్పులు జరిగేలా ఆరోగ్య వైద్యసిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వివిధ విభాగాల వైద్య నిపుణులు, ప్రజారోగ్య ప్రోగ్రామ్ అధికారులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించాలని, ఇక్కడ నిపుణులైన డాక్టర్లచే సాధారణ ప్రసవాలు చేస్తారన్నారు. అవసరం లేకున్నా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేసి డెలివరీలు చేస్తారని, దీంతో గర్భిణులకు మున్ముందు అనారోగ్య సమస్యల బారిన పడతారన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో చేరిన గర్భిణులను మధ్యవర్తులతో తమ ఆస్పత్రులకు తరలిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనునయి, గర్భిణుల వైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ ఆది సుజాత, మాతాశిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జయ శ్యామ సుందర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వాలి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సువెన్ కంపెనీలో పట్టభద్రులైన ఓటర్లను కలిసి రాకేష్‌రెడ్డికి ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా వచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చామన్న కాంగ్రెస్ మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. 90 శాతం దొడ్డురకం వడ్లు పండుతుంటే సన్నవడ్లకే బోనస్ ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాకేష్‌రెడ్డిని గెలిపించి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను చాటాలన్నారు. తెలంగాణను ఆంధ్రాలో కలపాలని కొందరు పిచ్చి కలలు కంటున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు చూడడానికి సోనియా మాత్రమే కాదు ఎవరైనా రావచ్చన్నారు. కానీ ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానిస్తామనడం కరెక్ట్ కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, రామచందర్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, తాహెర్‌పాషా, సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తదితరులు

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

- టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు

సూర్యాపేట టౌన్: వచ్చే నెలలో స్కూళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) అనుమతితో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హన్మంతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో టీపీయూఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆరేళ్లుగా బదిలీలు నిర్వహించకపోవడం వల్ల మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక, ఎనిమిదేళ్లుగా పదోన్నతుల్లేక అనేక పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికుల కొరతతో పాటు, బాలికలకు మూత్రశాలలు, తాగునీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు స్కూళ్లలో అన్నిరకాల పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. అలాగే, మౌలిక వసతులను కల్పించాలని, వేసవి సెలవుల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల విధుల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేశ్, జిల్లా కోశాధికారి బ్రహ్మాచారి, యానాల వెంకట్‌రెడ్డి, తిరుమలేష్, సాయికుమార్, పూల్‌సింగ్, సతీష్, శ్రీదేవి, రేణుక, కళావతి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, ప్రభాకర్, దశరథ, కృష్ణారెడ్డి, సంతోష్ కుమార్, నవీన్‌రెడ్డి, ధనేశ్వర్‌రావు, సురేష్, కార్తీక్‌రెడ్డి, వినయ్, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హన్మంతరావు

'అమ్మ ఆదర్శ' పనులు వేగవంతం

- జిల్లాలో 536 పాఠశాలలు ఎంపిక
- ఇప్పటివరకు 165 పాఠశాలల్లో పనులు పూర్తి
- విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి వసతులు కల్పించేలా ఏర్పాట్లు



చింతలపాలెం మండలం వజినేపల్లి యూపీఎస్‌లో పూర్తయిన తాగునీటి కుళాయి



ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ ఎంపీపీఎస్‌లో పూర్తయిన బాత్‌రూం పనులు

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు కల్పించేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. జిల్లాలో 950 పాఠశాలలు ఉండగా గత ప్రభుత్వం 329 పాఠశాలల్లో మన ఊరు – మనబడి పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టింది. అయితే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను రద్దు చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను నియమించి అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఇందుకోసం జిల్లాలో మౌలిక వసతులు, సౌకర్యాలు లేని 536 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకోసం రూ.10.87కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు ప్రతి మండలానికి రూ.3లక్షల చొప్పున 23 మండలాలకు రూ.69లక్షలు విడుదలయ్యాయి. పాఠశాలల్లో బాత్‌రూంలు, తాగునీరు, విద్యుత్, తరగతి గదులు, ప్రహరీలకు మరమ్మతులు చేపట్టాలని కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో ఇప్పటివరకు 165 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో వివిధ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. బడులు తెరిచే నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పనుల పురోగతిపై నిత్యం పర్యవేక్షణ

ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మండలంలో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. నిత్యం ఏదో ఒక పాఠశాలను సందర్శించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జూన్ 10వ తేదీ లోగా పనులు పూర్తి చేయాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు వాట్సాప్‌లో ఫొటోలు పంపాలని స్పష్టం చేశారు. ఇటు పర్యవేక్షణ బృందాలు, అటు కలెక్టర్, డీఈఓ నిత్యం పర్యవేక్షణ చేస్తుండడంతో పనులు వేగవంతమయ్యాయి.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ ఆదేశాలతో ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్నాం. చాలా వరకు పాఠశాలల్లో 90శాతం వరకు పనులు పూర్తయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

నల్లగొండ: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 26 వరకు ఆసక్తి గల మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. ఇక్కడ త్రెడ్డింగ్, వ్యాక్స్, సెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్‌ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్ తదితర వాటిల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ కోసం ఈనెల 27 వరకు నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ లో గల సాహితీ బ్యూటీ పార్లర్ అండ్ ట్రెనింగ్ సెంటర్‌లో రూ.3వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తారు. ఇతర వివరాల కోసం 9666013544, 80747 42864 సెల్‌నంబర్లలో సంప్రదించాలి.

వడదెబ్బతో వృద్ధుడు మృతి


వెంకన్న (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామంలో శనివారం వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటపహాడ్ గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకన్న(75) బుధవారం ఉపాధి హామీ కూలీ పనికి వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. అప్పటి నుంచి వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతూ స్థానికంగానే చికిత్స పొందుతున్న ఆయన శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల వెంకటరెడ్డి పరామర్శించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

పాల వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

నల్లగొండ క్రైం: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పాల వ్యాన్ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో శనివారం జరిగింది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో సాయినగర్‌కు చెందిన ఆంథోని(50) బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. దేవరకొండ నుంచి నల్లగొండ పట్టణంలోకి వస్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఆంథోనిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం


వెంకన్న

సూర్యాపేట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. వివరాలు.. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన నందికొండ వెంకన్న అలియాస్ వెంకటేష్ సూర్యాపేట పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సూర్యాపేట మండలం పరిధిలోని టేకుమట్ల తన చిన్నమ్మ ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఉదయం సూర్యాపేటకు వెళ్లిన వెంకన్న తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన బంధువులు శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సూర్యాపేట మండలం రాయినిగూడెం రాజుగారి తోట హోటల్ సమీపంలో వెంకన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాహనం అక్కడ వదిలి వెళ్లడంతో వెంకన్నను ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- ధ్వంసమైన ఇళ్ల పైకప్పులు
- పలు గ్రామాల్లో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు


భూదాన్‌పోచంపల్లి: ధర్మారెడ్డిపల్లిలో రేకులు లేచిపోయిన ఇల్లును పరిశీలిస్తున్న అధికారులు


భూదాన్‌పోచంపల్లి: వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులలకు దెబ్బతిన్న ఇళ్లను శనివారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గంగపురం వెంకటయ్య ఇంటిపై రేకులు పగిలి ఇంటి లోపల పడటంతో ఫ్రిజ్, బీరువా, ఇతర వస్తువులు ధ్వంసమయ్యాయి. పలువురి ఇళ్లలో బియ్యం తడిసిపోయాయి. ఈదురుగాలుల వలన రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ పేర్కొన్నారు. అదేవిధంగా 15 కరెంట్ స్తంభాలు, పలు చెట్లు నేలకూలాయన్నారు. కరెంట్ స్తంభాలు నేలకూలడంతో గ్రామంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కాగా ట్రాన్స్‌కో ఏఈ క్రాంతి కూలిన స్తంభాలను తిరిగి నాటి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఆస్తి నష్టం వివరాలను నమోదు చేసుకొని నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


చౌటుప్పల్: నక్కలగూడెంలో ధ్వంసమైన ఇంటి పైకప్పు

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్: మండల పరిధిలోని పెద్దకొండూరు గ్రామ పంచాయతీ మధిర నక్కలగూడెం గ్రామంలో గుండెబోయిన అంజయ్యయాదవ్ ఇంటి పైకప్పు శుక్రవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు పూర్తిగా ధ్వంసమైంది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.


భువనగిరి రూరల్: ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు

భువనగిరి మండలంలో..

భువనగిరి రూరల్: మండలంలోని ఆకుతోటబావి తండా, కాండ్లకుంటతండా, పచ్చర్లబోడుతండా, సూరెపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు సుమారు 15 ఇళ్ల పైకప్పులు, రేకులు నేలకొరగగా పెంకుటిళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్లకు అడ్డంగా పడిపోవడంతో భారీ నష్టం ఏర్పడింది. ట్రాన్స్‌కో సిబ్బంది శనివారం విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కాగా ఈదురుగాలులతో తీవ్రంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలంటూ ఆకుతోట బావితండా వాసులు తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ధరావత్ పద్మ, కేతావత్ హరి, రమేష్, బాష, మంజ్యా తదితరులు ఉన్నారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య


బీరప్ప (ఫైల్)

వలిగొండ: అప్పుల బాధతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిగిల్లకు గ్రామానికి చెందిన దివ్యాంగుడైన బుగ్గ బీరప్ప(47) గతంలో సాక్షర భారత్ కేంద్ర నిర్వాహకుడుగా పనిచేశాడు. ప్రభుత్వం దాన్ని రద్దు చేయడంతో కిరాణా దుకాణం నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం అతడికి గుండె జబ్బు రావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పుల బాధ తట్టుకోలేక జీవితంపై విరక్తితో శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న బీర్పను భార్య నిర్మల చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అమీర్ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): ఆటోను లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం తిరుమలగిరి మండలం తొండ గ్రామ శివారులో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన మహెమూద్ ఆదివారం గృహప్రవేశం చేస్తుండడంతో శనివారం ఆయన పెద్ద కుమారుడు అమీర్(17) తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి వెళ్లి ఆటోలో గొర్రెలను తీసుకొని తిరుమలగిరికి వస్తున్నాడు. ఈ క్రమంలో తొండ గ్రామ శివారులో తిరుమలగిరి నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో అమీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఇంటర్ పూర్తిచేశాడు. మృతుడి తండ్రి మహెమూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

భారీగా నల్లబెల్లం, పటిక పట్టివేత


పట్టుబడిన బెల్లం, పటికతో సీఐ శంకర్, ఎస్ఐలు

కోదాడరూరల్: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను కోదాడ ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాలు.. నాలుగు రోజుల కిందట అనంతగిరి మండలం పాలారంతండా నుంచి చనుపల్లిలో సారా విక్రయించేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా సారా తయారీకి బెల్లం ఎవరు సరఫరా చేస్తున్నారని అతడిని అడగగా రాత్రి వేళ కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో ఓ వాహనంలో వచ్చి అమ్ముతుంటారని తెలిపారు.

రెండు రోజులు నిఘా ఉంచి..

నిందితుడు ఇచ్చిన సమాచరం మేరకు కోదాడ ఎక్సైజ్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిఘా ఉంచి శుక్రవారం 100కేజీల నల్లబెల్లం, 600కేజీల పటికతో పాటు ఓ వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇంకా బెల్లం వస్తుందనే సమాచారం మేరకు శనివారం కూడా కోదాడ శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా ఓ బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.25లక్షల విలువైన 900కేజీల నల్లబెల్లం, 600కేజీల పటిక పట్టుబడింది. ఈ నల్లబెల్లాన్ని దామరచర్ల నుంచి అనంతగిరి మండలం పాలారంతండాలో డంపు చేసి అక్కడి నుంచి పరిసర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. నల్లబెల్లాన్ని తరలిస్తున్న సంపత్, గోపిపై కేసు నమోదు చేసి బొలేరోతో పాటు బెల్లం, పటికను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు రామకృష్ణ, యాదయ్య, గోవర్ధన్, సిబ్బంది ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం


పోలీసులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

మిర్యాలగూడ అర్బన్: నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఏపీలోని పల్నాడు జిల్లా శావల్యాపురం మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలను ఆరు బస్తాల్లో నింపుకుని ఓ వాహనంలో మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడకు తెచ్చారు. వాటిని మరో వాహనంలో ఎక్కించేందుకు సన్నద్ధ అవుతుండగా అదే సమయంలో వాహనాల తనిఖీ కోసం వచ్చిన వన్‌టౌన్ పోలీసులకు ఆ బస్తాలు అనుమానాస్పదంగా కనిపించడంతో వాటిపై ఆరా తీశారు. వ్యవసాయ అధికారి సరితను అక్కడికి రప్పించి వాటిని పరిశీలించగా అవి నకిలీ పత్తి విత్తనాలుగా గుర్తించారు. దీంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఆ నకిలీ విత్తనాలు మంచిర్యాలకు తరలిస్తున్నట్లు గుర్తించామని 260 కిలోల నకిలీ పత్తి విత్తనాల విలువ రూ.5 లక్షలు ఉంటుందని, వ్యవసాయ అధికారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. కాగా నకిలీ విత్తనాల కేసులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నీటి బకెట్‌లో పడి బాలుడు మృతి


మృతిచెందిన రాజ్‌కుమార్‌సింగ్

హుజూర్‌నగర్: నీటి బకెట్‌లో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం జరిగింది. బాలుడి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద గల మోడల్ కాలనీలో సతీ సంతోష్‌సింగ్, సతీ కవితకౌర్ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు రాజ్‌కుమార్‌సింగ్(2) శనివారం ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలో ఉన్న నీటి బకెట్‌లో పడిపోయాడు. కొంతసేపటికి గమనించిన తల్లిదండ్రులు అతడిని బయటకు తీసి హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపారు. ఉట్లపల్లి గ్రామానికి చెందిన బొల్లెద్దు పాపయ్య ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందడంతో అతడి ఇంటిపై దాడి చేసి 43 క్వింటాళ్ల(86 బస్తాలు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రేషన్ లబ్ధిదారుల నుంచి అతడు తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. సివిల్ సప్లయ్ ఆర్ఐ ఠాగూర్ సురేందర్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ సిబ్బందిపై దాడి.. కేసు నమోదు

గుండాల: కరెంట్ లైన్లు సరిచేస్తున్న విద్యుత్ సిబ్బందిపై దాడి చేసిన వారిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ యాకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ సిబ్బంది కరెంట్ లైన్లు సరిచేస్తుండగా.. అదే కాలనీకి చెందిన అన్నెపర్తి ప్రసాద్, అన్నెపర్తి ప్రమోష, అన్నెపర్తి సాయిలు తమపై దాడి చేశారని ఆర్టిజన్ మొలకల మధు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

తుంగతుర్తి: తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామంలో శనివారం జరిగింది. వివరాలు.. గొట్టిపర్తి గ్రామానికి చెందిన గీతకార్మికుడు బాలగాని మల్లయ్య రోజుమాదిరిగా శనివారం కూడా గ్రామ పరిధిలో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా.. మోకు జారి కిందపడ్డాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

రాష్ట్రపతి ప్రసంగంలో 'రావి' పేరు ప్రస్తావించాలి


రాష్ట్రపతి భవనానికి లేఖను పంపుతున్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు

భువనగిరి రూరల్: 18వ లోక్‌సభ జూన్‌లో ఏర్పాటవుతున్న సందర్భంగా సభను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించే ప్రసంగంలో రావి నారాయణరెడ్డి పేరు ప్రస్తావించాలని రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశంలో మొదటిసారిగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రావి నారాయణరెడ్డి దేశంలోనే అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలుపొందాడని అన్నారు. అంతేకాకుండా అప్పట్లో పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డే ప్రారంభించారని పేర్కొన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి పేరును 18వ లోక్‌సభ ఏర్పాటవుతున్న సందర్భంగా రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయానికి లేఖను పంపించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రావి సుఖేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, కోశాధికారి తిరుమణిదాస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.10లక్షల విలువైన చేపలు మృత్యువాత


గుండ్లకుంట చెరువులో నీటిపై తేలుతున్న మృతిచెందిన చేపలు

చివ్వెంల: మండలంలోని కుడకుడ గ్రామ శివారులో గల గుండ్లకుంట చెరువులో శనివారం రూ.10లక్షల విలువైన చేప పిల్లలు, చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కొన్నబోయిన వెంకన్న విలేకరులతో మాట్లాడుతూ.. గుండ్లకుంట చెరువును అదే గ్రామానికి చెందిన షేక్ ఖలీల్, మరో వ్యక్తి రెండేళ్ల క్రితం చేపల పెంపకానికి లీజుకు తీసుకున్నారని పేర్కొన్నారు. లీజు గడువు మరో 15 రోజుల్లో ముగియనుండడంతో కాంట్రాక్టర్ షేక్ ఖలీల్ శుక్రవారం వచ్చి రాత్రి వరకు చేపలు పట్టాడని, మిగిలిన చేపలు పట్టేందుకు చెరువులో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశాడని వివరించారు. మోతాదుకు మించి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయడంతో శనివారం తెల్లవారుజామున చేపలు మృత్యువాత పడ్డాయని అన్నారు. రూ.10లక్షల విలువైన చేప పిల్లలు, చేపలు మృత్యువాత పడ్డాయని, దీనికి కారణమైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇదేమిటని కాంట్రాక్టర్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని ఆరోపించారు. ఈ ఘటపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో మత్స్యకార సంఘం సభ్యులు కోనెబోయిన పున్నయ్య, ఈదయ్య, శ్రీను, నాగరాజు, ఉప్పలయ్య, సత్యనారాయణ, భారతమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

భువనగిరి క్రైం: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామ శివారులో శనివారం జరిగింది. వివరాలు.. భువనగిరి మండలం పచ్చర్లబోడుతండాకు చెందిన మెగావత్ రమేష్ పని నిమిత్తం బైక్‌పై భువనగికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అనాజిపురం గ్రామ శివారులో గల దివ్యబాల స్కూల్ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా ఆటో వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బైక్ అదుపుతప్పడంతో..

మర్రిగూడ: బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిగూడ మండలం రాజాపేటతండా సమీపంలో శనివారం జరిగింది. వివరాలు.. మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లికి చెందిన కొప్పుల శివ, ఐతగోని ఉపేందర్ పని నిమిత్తం బైక్‌పై మర్రిగూడకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. రాజాపేటతండా మూలమలుపు వద్ద వారి బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో వారిద్దరి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం మాల్‌కు తరలించారు.

యాదాద్రి క్యూలైన్లలో భక్తులకు అస్వస్థత


క్యూలైన్‌లో అస్వస్థతకు గురైన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసు సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం క్యూకాంప్లెక్స్‌లో ఏసీలు, ఫ్యాన్లు పనిచేయకపోవడంతో శనివారం కొందరు భక్తులు ఉక్కపోతతో అస్వస్థతకు గురయ్యారు. గంటల తరబడి క్యూలైన్‌లో భక్తులు నిల్చోని ఉండటంతో ఓ మహిళా భక్తురాలు స్పృహతప్పి కిందపడిపోయింది. ఇక కొండపై బస్టాండ్‌లో బస్సుల కోసం భక్తులు గొడవ పడ్డారు. క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో అస్వస్థతకు గురైన భక్తులను ఎస్పీఎఫ్ పోలీసులు, ఆలయాధికారులు కొండపైన వైద్యాధికారితో ప్రథమ చికిత్స చేయించి, కొండ కింద యాదగిరిపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మాడ వీధిలో చెప్పులతో భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు మాడ వీధిలో శనివారం ఇద్దరు మహిళా భక్తులు పాదరక్షలు(చెప్పులు) ధరించి తిరగడంతో ఇతర భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఆలయ సిబ్బంది పట్టించుకోలేదని అక్కడున్న భక్తులు వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆలయాధికారులను భక్తులు కోరారు.


ఆలయ తూర్పు మాడ వీధిలో చెప్పులతో తిరుగుతున్న భక్తులు

మద్యం స్వాధీనం

రామగిరి(నల్లగొండ): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని తాళ్లగడ్డకు చెందిన బెల్ట్ షాపు నిర్వాహకురాలు గోనె కవిత తిప్పర్తిలోని వైన్ షాపులో 15 కాటన్లన బీర్లు, 40 క్వాటర్లు, 16 హాఫ్ బాటిళ్ల మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా.. తిప్పర్తి మండల కేంద్రంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

సేంద్రియ ఎరువులే పంటకు బలం

- కోదాడ ఇన్‌చార్జి ఏడీఏ రాజగోపాలరావు


పొలంలో వేసిన పశువుల పెంట

నడిగూడెం: సేంద్రియ ఎరువులతో పంటకు ఎక్కువ బలం చేకూరడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో కోదాడ ఇన్‌చార్జి ఏడీఏ ఎం. రాజగోపాలరావు సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

పశువుల ఎరువు..



రైతులు అనాదిగా వినియోగిస్తున్న ఎరువే ఇది. అయితే రానురాను వ్యవసాయంలో యాంత్రీకరణ చొరబడడంతో పశుసంతతి తగ్గి పశువుల ఎరువు అందుబాటులో లేకుండా పోయింది. పంటలకు ఉపయోగించే ఎరువుల్లో ఇది చాలా ముఖ్యమైంది. ప్రాథమికంగా ఈ ఎరువు ఏ పంట సాగులోనైనా వేసి తీరాల్సిందే. పంటలకు పోషకాలను అందించడంతో పాటు పొలంలో కురిసిన వాన నీటిని ఒడిసిపట్టి పంటలకు అందించడంలో పశువుల పేడ కీలకపాత్ర పోషిస్తుంది. మిగతా ఎరువులను పంటకు అందించాలన్నా ఈ ఎరువు తరువాత ఏదైనా పొలంలో ఒక వరుస మట్టి, ఆ తరువాత పశువుల ఎరువు మరో పొర మట్టి, పశువుల ఎరువు ఇంకో పొర ఆకులు, అలమలు, పశువుల మేత వేయగా తొక్కి పడేసిన చెత్త చెదారాలను తొలకరి వర్షాలు కురవగానే వెంటనే ఆ కుప్పలోని ఎరువు మట్టిని చిన్న చిన్న కుప్పలుగా పోసి పొలమంతా చల్లితే మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేసి, పొలంలో వేయడం వల్ల పోషకాలు సమృద్ధిగా తయారై పంటకు కావాల్సి న బలాన్ని అందిస్తుంది.

కంపోస్టు ఎరువు

గ్రామాల్లో లభ్యమయ్యే చెత్త, రాలిన ఆకులు, పార్థీనియం, ఇతర కలుపు మొక్కలు, కుళ్లిన కూరగాయలు, వేరుశనగా కాయల పొట్టును కలిపి పశువుల పేడ, మూత్రంతో కుప్పగా వేసి కుళ్లింపజేస్తే తయారయ్యే ఎరువే కంపోస్టు ఎరువు. దీనిని కూరగాయ పంటలకు, ఇతర పంటలకు వేస్తే మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు, చీడ, పీడలు లేకుండా ఆశించిన దిగుబడి వస్తుంది.

కోళ్ల ఎరువు

కోళ్లఫారాల్లో లభ్యమయ్యే ఎరువు కోళ్ల కింద వేసిన పొట్టు, మల మూత్రాలతో సేంద్రియ ఎరువు తయారవుతుంది. దాదాపు 40 కోళ్ల నుంచి ఏడాదికి టన్ను ఎరువు వస్తుంది. ఈ ఎరువులో 3 శాతం నత్రజని, 2 శాతం భాస్వరం, 2 శాతం పొటాష్ ఉంటుంది. తేమ తగ్గే కొద్దీ పోషక శాతం పెరుగుతుంది.

ఉపయోగాలు ఇవే..

సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సేంద్రియ పదార్థం భౌతిక లక్షణాలను మెరుగుపరుస్తుంది. బరువు నేలలు గుల్లబారి వేర్లు చక్కగా పెరగడానికి సహాయపడుతుంది. నీరు కూడా ఇంకుతుంది. ఇసుక నేలల్లో మట్టి రేణువుల అమరికను క్రమబద్ధీకరిస్తుంది. నీటిని గ్రహించి తేమను ఎక్కువగా కాలం పట్టి ఉంచుకొని పంటను బెట్టకు గురికాకుండా చేస్తుంది. అలాగే నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి పెరుగుతుంది. నేలలోని పోషకాలను మొక్కలు గ్రహించేందుకు తోడ్పడే సూక్ష్మ జీవులకు ఆహారంగా ఉపయోగపడుతుంది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Services

డాక్యుమెంట్ పోయినది

■ బత్తిని సీతారామమ్మ W/o భద్రయ్య R/o పోలేనిగూడెం నేను చిలుకూరు నుండి బేతవోలు ఆటోలో వస్తుండగా నా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 926/2020 లింక్ డాక్యుమెంట్ పోయినవి. దొరికినవారు సంప్ర॥ 9291559456 [Y-798363]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185087]

■ అన్నపూర్ణ హోమ్‌కేర్ HYD లో కేర్ టేకర్స్, పేషెంట్ కేర్, బేబీ కేర్, పెద్దవారికి సేవ చేయడానికి ఆయాలు, నర్సులు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 16000/- to 30000/-,రూమ్+మీల్స్ ఫ్రీ. ఫోన్.8390427694 [H-788091]

■ హరేకృష్ణ హోమ్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899 [H-799885]

■ శ్రీ సాయి కృష్ణవేణి హైస్కూల్ పెద్ద అడిశర్లపల్లి పాఠశాల నందు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులు బోధించడానికి టీచర్లు కావలెను. సెల్: 9949371361, 9963031380 [Y-1124494]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799726]

ప్రకటన కొరంతే! స్పందన కొండంతే!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
వివరాలకు
నల్లగొండ: 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ: 9666021744
ఎకిరేటల్: 9010178203
సూర్యాపేట: 9912220740, 9010038110
కోదాడ: 9010046033
భువనగిరి: 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.